సాక్షి
పెద్దపల్లి
శనివారం । 15 । జూలై । 2023



షిర్డీ సాయి సేవలో కోలేటి

గోదావరిఖని: రాష్ట్ర పోలీస్‌హౌజింగ్ బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్ శుక్రవారం షిర్డీ సాయిబాబాను దర్శించుకున్నారు.



పత్తి క్వింటాల్ ధర రూ.6,695

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌యార్డులో శుక్రవారం పత్తి క్వింటాల్ ధర రూ.6,695, కనిష్టం రూ.6,001, సరాసరి ధర రూ.6,451 నమోదైంది.

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరుగుతుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న ఎత్తిపోతలు



నీటిని ఎత్తిపోస్తున్న మోటార్లు

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి కాళేశ్వరం జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శుక్రవారం పార్వతీ పంపుహౌజ్ నుంచి ఎల్లంపల్లిలోకి నాలుగు మోటార్లతో 20,880 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 14.29 టీఎంసీలకు చేరిందని నీటిపారుదలశాఖ అధికారులు పేర్కొన్నారు. కాగా ప్రాజెక్టు నుంచి 9,781 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగుతుంది.

మేడారం పంప్‌హౌజ్ నుంచి..

ధర్మారం(ధర్మపురి): ధర్మారం మండలం నందిమేడారం నంది పంప్‌హౌజ్ నుంచి శుక్రవారం మూడుపంప్‌ల ద్వారా కాళేశ్వరం జలాలను ఎత్తిపోస్తున్నారు. వారం రోజుల పాటు రెండు పంప్‌లతో జలాలను ఎత్తిపోసిన అధికారులు ప్రస్తుతం మూడు పంప్‌ల ద్వారా 6,450 క్యూసెక్కుల నీటిని మేడారం రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. రిజర్వాయర్ నుంచి రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయిత్రీ పంప్‌హౌజ్‌కు అదే స్థాయిలో నీటిని తరలిస్తున్నారు. కాగా ఉదయం నుంచి సాయంత్రం వరకు పంప్‌లను నడిపిస్తున్న అధికారులు సాయంత్రం నిలిపివేస్తున్నారు.

అంబేడ్కర్ మ్యూజియం సందర్శన



నివాళి అర్పిస్తున్న పుట్ట మధు, తదితరులు

మంథని: మహనీయుల జన్మస్థలాలు, పుణ్యస్థలాల సందర్శనలో భాగంగా లండన్ పర్యటనకు వెళ్లిన జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మ్యూజియాన్ని సందర్శించారు. అక్కడి వారితో మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. ఆయన వెంట అయిలి భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

పెద్దపల్లిరూరల్: సాధారణ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శుక్రవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కాన్ఫరెన్సులో కలెక్టర్ డాక్టర్ ఎస్.సంగీత సత్యనారాయణ, అదనపు కలెక్టర్లు వి.లక్ష్మీనారాయణ, కుమార్‌దీపక్, అధికారులు పాల్గొన్నారు.

వీవీప్యాట్‌లపై అవగాహన కల్పించాలి

జిల్లాలో నియోజకవర్గాల వారీగా అన్ని గ్రామాల్లో ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సంగీత అన్నారు. సెప్టెంబర్ వరకు ఈ ప్రక్రియ పూర్తి కావాలన్నారు. ఈనెల 18న ట్రెయినర్లకు శిక్షణ ఇప్పించి 20 నుంచి అవగాహన కార్యక్రమాలు ప్రారంభించాలని సూచించారు. జిల్లాలో ప్రతి పోలింగ్ కేంద్రం వారీగా పురుషులు, మహిళల ఓటర్ల వివరాలు రూపొందించాలన్నారు. ఆర్డీఓ వీరబ్రహ్మచారి, ఆర్డీఓ రంగారావు, డీటీ ప్రవీణ్ తదితరులున్నారు.

దళితుల ఆర్థిక అభ్యున్నతికే ‘దళితబంధు’



యూనిట్‌ను పరిశీలిస్తున్న శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్‌రూరల్/సుల్తానాబాద్: దళితులు ఆర్థికంగా ఎదిగేందుకు సహకారం అందించాలనే ఆలోచనతో సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని అమల్లోకి తెచ్చారని, వాటి ద్వారా లబ్ధిదారులు కష్టపడి పనిచేసుకుంటూ ఎదగాలని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లి మండలం పెద్దకల్వల, సుల్తానాబాద్‌లో దళితబంధు యూనిట్లను పరిశీలించారు. పెద్దకల్వలలో ఏర్పాటు చేసిన ఆటో మొబైల్ దుకాణాన్ని సందర్శించి ల బ్ధిదారుడు మల్లేశ్‌తో ముచ్చటించారు. దుకా ణం ఏర్పాటు చేసిన తర్వాత జీవనశైలిలో వచ్చి న మార్పులను ఆర్థికంగా ఎదుగుతున్న తీరుపై ఆరా తీశారు. అలాగే సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లిలో లబ్ధిదారుడు కల్వల సంపత్, భూ పతిపూర్‌లో శ్రీనివాసులు, గట్టెపల్లిలో దాసరి సంపత్‌ను అడిగి వ్యాపార వ్యవహారాలపై చర్చించారు. ఆయన వెంట ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మధుసూదన శర్మ, ఈఓ రవికుమార్‌రావు తదితరులున్నారు.



గులాబీలో ‘యాత్రల’ లొల్లి

రామగుండం ఎమ్మెల్యేకు ‘ఆశావహుల’ గండం

సాక్షి, పెద్దపల్లి: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో జిల్లాలో అధికార, విపక్ష పార్టీల నేతలు జనం బాట పట్టారు. సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ గడప గడపకూ పార్టీ అంటూ వివిధ పేర్లతో చేపడుతున్న కార్యక్రమాలతో జిల్లాలో రాజకీయం వేడెక్కిస్తున్నారు. అయితే రామగుండం నియోజకవర్గంలో మాత్రం ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు.. అధికార పార్టీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడికే పోటాపోటీగా ఎమ్మెల్యే ఆశావహులు రహస్య సమావేశం నిర్వహించి పాదయాత్రలు చేస్తామని ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిట్టింగ్ ఎమ్మెల్యేతో పాటు, కార్పొరేటర్లు, కార్మిక నాయకులు అభ్యర్థులుగా తమకు తాము ప్రకటించుకొని టికెట్ దక్కించుకునేందుకు ఎవరికి వారే పావులు కదుపుతున్నారు.

- యాత్రల పేరుతో బస్తీ, పల్లె, గనుల వద్దకు..
- కోరుకంటికి పోటీగా పాదయాత్రలకు ప్లాన్
- అయోమయంలో బీఆర్‌ఎస్ శ్రేణులు

జిల్లా అధ్యక్షుడికే తప్పని ‘ఇంటి పోరు’

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడిగా పార్టీ శ్రేణులను ఒక్కతాటి పైకి తీసుకవచ్చి, పార్టీని బలోపేతం చేయాల్సిన కోరుకంటి చందర్‌పై ఇంటిపోరును సరిదిద్దలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో బహిరంగంగా ఎలాంటి ప్రకటనలు, కార్యకలాపాలు చేయని ఆశావహులు, ఎన్నికలు దగ్గరపడుతుండటంతో నేరుగా పాదయాత్రల పేరుతో రంగంలోకి దిగుతుండటంతో రామగుండంలో రాజకీయం రసవత్తరంగా మారింది. సిట్టింగ్‌లకే టికెట్లు అని సీఎం కేసీఆర్ ప్రకటించటంతో ఈసారి తనకే టికెట్ వస్తుందని ఎమ్మెల్యే చందర్

- ‘ప్రజాచైతన్య యాత్ర ’పేరుతో గడప గడపకూ పార్టీ కార్యక్రమాలు, చేసిన అభివృద్ధిని

ప్రజలకు తెలియజేసేలా పర్యటిస్తున్నారు. కాగా బీఆర్‌ఎస్ నుంచి టికెట్ ఆశిస్తున్న పలువురు అభ్యర్థులు ఎమ్మెల్యే కోరుకంటికి వ్యతిరేకంగా రహస్యంగా పలు దఫాలుగా సమావేశమై, కోరుకంటికి తప్ప ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటామని ప్రకటనలు చేశారు. తాజాగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేకు పోటాపోటీగా శనివారం నుంచి పాదయాత్రలు మొదలు పెట్టి కేసీఆర్‌ను సీఎంగా గెలిపించుకుంటామనడం, ప్రస్తుత ఎమ్మెల్యే గెలుపుకోసం పాటుపడుతామని ప్రకటించకపోవడం హాట్‌టాపిక్‌గా మారింది. అయితే ఎమ్మెల్యే కోరుకంటి మాత్రం ఈ పరిణామాలన్నింటినీ చాలా చిన్నవిగా భావిస్తున్నట్లు వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్యే టికెట్ తమకే అంటూ ప్రకటించుకున్న నాయకులపై జిల్లా అధ్యక్షుడిగా ఎలాంటి చర్యలకు పూనుకోకుండా ఉదాసీనంగా ఉంటున్నారు. దీంతో ఆశావహులు ప్రజలకు మరింత దగ్గర అయ్యేందుకు పార్టీ, ప్రభుత్వ కార్యకలాపాలతో పాటు, స్వచ్ఛంద సంస్థల పేరుతో వేగంగా దూసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు.

కేసీఆర్ గెలుపే లక్ష్యంగా పాదయాత్ర

రామగుండంలో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసేందుకు అరడజనుకు పైగా పేర్లు వినిపిస్తున్నాయి. ఇందులో ప్రధానంగా పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, సీనియర్ నాయకుడు, కార్పొరేటర్ పాతిపెల్లి లక్ష్మి భర్త పాతిపెల్లి ఎల్లయ్య, టీబీజీకేఎస్ నేత మిర్యాల రాజిరెడ్డి, మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కొలేటి దామోదర్ పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. టికెట్ ఆశిస్తున్నవారంతా తమ తమ సామాజిక వర్గాల బలాలు, బలహీనతలు, ఖర్చులు, పెట్టుబడులను అంచనా వేసుకొని బీఆర్‌ఎస్ పార్టీ పెద్దలతో తమకున్న పరిచయాలతో పాదయాత్రల పేరిట ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. కోలేటి దామోదర్ పాదయాత్రలతో కాకుండా సీఎం కేసీఆర్‌తో తనకున్న సాన్నిహిత్యంతో టికెట్ సాధించే పనిలో ఉన్నారు. అధికార పార్టీలో ఇలాంటి వాతావరణం ఉన్నప్పటికీ ఎలాంటి నియంత్రణలు, క్రమశిక్షణ చర్యలు లేకుండా పోయాయి. ఇది అంతర్గత ప్రజాస్వామ్యానికి సంకేతమా లేక అంతర్గత కలహాలకు నిదర్శనమా అర్థం కావడం లేదని సగటు గులాబీ శ్రేణులు ఆందోళన చెందుతున్నారు.

నేటి నుంచి ఆశావహుల డివిజన్ బాట



కొంకటి ఇంట్లో సమావేశమైన ఆశావహులు

గోదావరిఖని(రామగుండం): ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్‌ఎస్ ఆశావహులు సిద్ధమయ్యారు. శనివారం నుంచి రామగుండం నియోజకవర్గంలో డివిజన్లు, గ్రామాలు, గనులపై పాదయాత్ర నిర్వహించనున్నట్లు మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ, జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు పాతిపెల్లి ఎల్లయ్య తెలిపారు. ఈమేరకు నాయకులు సమావేశమైన ఈవిషయాన్ని వెల్లడించారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ధ్యేయంగా ప్రజల బాట పట్టినట్లు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే అనుసరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా, పార్టీకి అనుకూలంగా ప్రచారం నిర్వహించాలని నిర్ణయించినట్లు వివరించారు. బస్తీలు, గ్రామాలు, గనుల బాట చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే ఏకపక్షంగా అనుసరిస్తూ నాయకత్వాన్ని పట్టించుకోవడం లేదని ఆశావహులు పేర్కొన్నారు.

ఎన్నికల బదిలీలు షురూ!



కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ ప్రియాంక.. కలెక్టర్ సంగీత, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్ దీపక్

- పెద్దపల్లి కలెక్టర్‌గా ముజమ్మిల్ ఖాన్
- కరీంనగర్ జెడ్పీ సీఈవోకు పెద్దపల్లి అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు
- సిద్దిపేట అదనపు కలెక్టర్‌గా గరిమా బదిలీ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/పెద్దపల్లిరూరల్: సార్వత్రిక ఎన్నికల క్రమంలో బదిలీల వేగం పుంజుకుంది. ఇటీవల డీఎస్పీలను బదిలీ చేసిన ప్రభుత్వం శుక్రవారం అదనపు కలెక్టర్లను బదిలీ చేయగా కన్‌ఫర్డ్ ఐఏఎస్‌లకు పదోన్నతి కల్పిస్తూ అదనపు కలెక్టర్లుగా నియమించింది. అలాగే ఆర్డీవోలకు సైతం స్థానచలనం కల్పించింది. ఉమ్మడి జిల్లాలో పలువురు అదనపు కలెక్టర్లను బదిలీ చేయగా నేడు, రేపు కూడా మరిన్ని బదిలీలు జరిగే అవకాశముందని సమాచారం.

- సిద్దిపేట అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) ముజమ్మిల్‌ఖాన్‌ను పెద్దపల్లి కలెక్టర్‌గా నియమించగా పెద్దపల్లి కలెక్టర్ ఎస్.సంగీత సత్యనారాయణను టీఎస్ ఫుడ్స్ ఎండీగా నియమించారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) దివాకర్‌ను జగిత్యాల అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)గా నియమించగా అదనపు కలెక్టర్ మంద మకరందు‌ను నిజామాబాద్ మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు.
- పెద్దపల్లి అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) కుమార్ దీపక్‌ను నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్‌గా బదిలీ చేయగా అతనిస్థానంలో కరీంనగర్ కలెక్టర్ ఆర్వీ కర్ణన్ సతీమణి కరీంనగర్ జెడ్పీ సీఈవో ప్రియాంకను నియమించారు. అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ బదిలీ కాగా ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు.
- వెయిటింగ్‌లో ఉన్న జల్ద అరుణశ్రీని కరీంనగర్ అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)గా నియమించారు. ఈమె గతంలో కరీంనగర్ డీఆర్డీవోగా విధులు నిర్వహించారు.
- కరీంనగర్ జాయింట్ కలెక్టర్(ట్రైనీ) నవీన్ నికోలస్‌ను తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ సెక్రటరీగా నియమించారు.
- కరీంనగర్ అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) గరిమా అగర్వాల్‌ను సిద్దిపేట అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)గా నియమించారు.
- కరీంనగర్ అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా ఉన్న శ్యాం ప్రసాద్‌లాల్‌ను పెద్దపల్లి అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా బదిలీఅయ్యారు. శ్యాంప్రసాద్ లాల్ స్థానంలో సిద్దిపేట స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న కె.లక్ష్మీకిరణ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

జనవరిలోనే చెప్పిన సాక్షి



సాక్షి కథనం

సీపీ సత్యనారాయణ, అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ బదిలీ అవుతారని, అలాగే గతంలో జెడ్పీ సీఈవోగా ఉన్న ప్రియాంకకు ఐఏఎస్ హోదా రానుందని, ఆ వెంటనే బదిలీ కూడా అవుతారని ‘సాక్షి’ ఈ ఏడాది జనవరి 3న కథనం ప్రచురించింది. ఆ కథనం ప్రకారమే ఈ ముగ్గురు ఉన్నతాధికారులు బదిలీ అయ్యారు.

ఆర్డీవోలు సైతం

ప్రస్తుతం ఉట్నూరు ఆర్డీవోగా ఉన్న కె.మహేశ్వర్‌ను కరీంనగర్ ఆర్డీవోగా నియమించారు. కరీంనగర్ ఆర్డీవో ఎన్.ఆనంద్‌కుమార్‌ను సిరిసిల్లకు బదిలీచేశారు. సిరిసిల్ల ఆర్డీవో టి. శ్రీనివాసరావు డిప్యూటీ కలెక్టర్ అండ్ తహసీల్దార్ శేరిలింగంపల్లికి బదిలీపై వెళ్లనున్నారు. జగిత్యాల ఆర్డీవో మాధురిని సంగారెడ్డి అడిషనల్ కలెక్టర్‌గా పంపారు. అలాగే మంథని ఆర్డీఓగా పనిచేస్తున్న వీరబ్రహ్మచారిని సూర్యాపేట జిల్లాకు బదిలీ అయ్యారు.

సివిల్స్–2016లో తెలంగాణ టాపర్

ముజమ్మిల్‌ఖాన్ 2014లో తొలిసారిగా సివిల్స్ రాస్తే ఐఆర్‌టీఎస్ వచ్చింది. శిక్షణ పూర్తయ్యాక ఏసీఎంగా కొలువు దక్కింది. 2015లో మళ్లీ సివిల్స్ రాయగా ఐఆర్‌ఎస్‌కు ఎంపికయ్యారు. అందులో చేరకుండా పాత ఉద్యోగంలోనే కొనసాగుతూ మూడోసారి 2016లో సివిల్స్ రాయగా జాతీయస్థాయిలో 22వ, రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్‌ను సాధించారు. ఐఏఎస్ శిక్షణ పూర్తి చేశాక 2018లో వికారాబాద్ అసిస్టెంట్ కలెక్టర్, హుస్నాబాద్ డిప్యూటీ కలెక్టర్ పని చేశారు. ఫిబ్రవరి 2020లో సిద్దిపేట జిల్లాకు అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. శుక్రవారం పెద్దపల్లి కలెక్టర్‌గా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈయన మాజీ సీనియర్ ఐపీఎస్ అధికారి ఏకే ఖాన్ కుమారుడు కావడం గమనార్హం.

ప్రజా సంక్షేమం పట్టని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- రామగుండం ఎమ్మెల్యే చందర్



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని(రామగుండం): ప్రజా సంక్షేమం పట్టని కాంగ్రెస్ పార్టీ నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం స్థానిక 44వ డివిజన్‌లో ప్రగతి దశాబ్ది ప్రజా చైతన్యయాత్ర నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రంలో రైతులకు 3గంటల కరెంటు సరిపోతుందని 24 గంటల కరెంటు అవసరం లేదని మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి ముక్కు నేలకురాసి తెలంగాణ రైతాంగానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ వాళ్లు వస్తే ఈ విషయాలపై నిలదీయాలన్నారు. కేసీఆర్ పాలనపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని, రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కల్వచర్ల కృష్ణవేణి, జనగామ కవిత, నాయకులు ఇనుముల సత్యం, నీరటి శ్రీనివాస్, బక్కి కిషన్, మెతుకు దేవరాజ్, పర్లపల్లి రవి, నారాయణదాసు మారుతి, చెలకలపల్లి శ్రీనివాస్, కోడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఘాట్ పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

కమాన్‌పూర్(మంథని): మండలంలోని గుండారం రిజర్వాయర్ కట్టపై బతుకమ్మ ఘాట్ పనులు ప్రారంభమైనాయి. గత నెల 30న ‘సాక్షి’లో ‘అసంపూర్తిగానే బతుకమ్మ ఘాట్’ శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు బతుకమ్మ ఘాట్ పూర్తి చేయాలని సదరు కాంట్రాక్టర్‌ను ఆదేశించడంతో పనులు కొనసాగుతున్నాయి.



కొనసాగుతున్న బతుకమ్మ ఘాట్ పనులు

నూతన విద్యుత్ కేంద్రాన్ని స్థాపించాలి



మాట్లాడుతున్న కౌశిక హరి

రామగుండం: పట్టణంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం గల బీ–థర్మల్ విద్యుత్ కేంద్రానికి కాలం చెల్ల డంతో దానిని కూలదోసి అదే స్థానంలో 800 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్లను స్థాపించాలని బీజేపీ సీనియర్ నాయకుడు కౌశిక హరి, స్థా నిక కార్పొరేటర్ కౌశిక లత డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడారు. కొత్త విద్యుత్ కేంద్రం స్థాపించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న తమతో కలిసివచ్చే అన్ని సంఘాలతో విద్యుత్ కేంద్రం ఎ దుట ధర్నా చేయనున్నట్లు పేర్కొన్నారు. నూతన కేంద్రం సాధించే వరకు దశలవారీగా ఆందోళన కా ర్యక్రమాలు చేపడుతామని వివరించారు. స్థానికంగా వందలాది ఎకరాల ప్రభుత్వ స్థలం, వనరులు అందుబాటులో ఉండడంతో నాణ్యమైన విద్యుత్‌ను తక్కువ వ్యయానికే ఉత్పత్తి చేయవచ్చని పేర్కొన్నా రు. అలాగే స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు పె రుగుతాయని తెలిపారు. ధర్నాకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకుడు మద్దికుంట శంకర్, కుక్క గంగాప్రసాద్, నిమ్మరాజుల రవి, మారం వెంకటేష్, రామన్న, ప్రసాద్ తదితరులున్నారు.

రామగుండం కమిషనరేట్‌లో ఆర్‌ఐల బదిలీ



గోదావరిఖని(రామగుండం): రానున్న అసెంబ్లీ ఎ న్నికల నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పలువురు రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పనిచేస్తున్న వి.మధుకర్‌ను రాజన్న సిరిసిల్ల జిల్లా, తీగెల శ్రీధర్‌ను వరంగల్ కమిషనరేట్, జె.అనిల్‌కుమార్ మహబూబాబాద్, సైదుల అంజన్న ఆసిఫాబాద్‌కు బదిలీ చేశారు. వీరి స్థానంలో కరీంనగర్ నుంచి సుంకె మల్లేష్, భద్రాద్రి కొత్తగూడెం నుంచి టి.దామోదర్, జగిత్యాల నుంచి వి.వామనమూర్తి, కొమురంభీం ఆసిఫాబాద్ నుంచి మాదాసు శ్రీనివాస్ రామగుండం కమిషనరేట్‌కు బదిలీ చేశారు.

కమిషనరేట్ పోలీసులకు పతకాలు

గోదావరిఖని(రామగుండం): రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పనిచేస్తున్న పలువురు పోలీసు అధికారులు, ఉద్యోగులకు ఉత్తమ సేవా పతకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మహోన్నత సేవా పతకానికి గోదావరిఖని టూటౌన్ రైటర్‌గా పనిచేస్తున్న ఎ.శారద ఎంపికైంది. ఉత్తమ సేవా పతకానికి కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల ఏసీపీ బిల్లా తిరుపతిరెడ్డి, మంచిర్యాల సీసీఎస్‌లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబల్ ఎ.సత్తయ్య ఎంపికయ్యారు. సేవా పతకానికి రామగుండం ఐటీ సెల్ సీఐ పి.కరుణాకర్, కార్ ఏఆర్ ఎస్‌ఐ సయ్యద్ రజాక్, టాస్క్‌ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాస్, రామగిరి హెడ్‌కానిస్టేబుల్ బి.రాజమల్లయ్య, గోదావరిఖని టూటౌన్ హెడ్‌కానిస్టేబల్ షేక్ హబీబ్, కార్ హెడ్‌కానిస్టేబల్ పత్తిపాక శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు.

జగన్నాటకానికి తెరలేపిన బీఆర్‌ఎస్

- డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్



మాట్లాడుతున్న ఎంఎస్ రాజ్‌ఠాగూర్

గోదావరిఖని(రామగుండం): రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఉచిత విద్యుత్ పేరుతో జగన్నాటకానికి తెరలేపిందని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ విమర్శించారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాటలను బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించాలని చూస్తున్నారని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యత తీసుకున్న మొదటిరోజే ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీపై సంతకం చేశారని గుర్తుచేశారు. ఉచిత కరెంట్‌లో కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వం దోచుకోవాలని చూస్తోందన్నారు. విద్యుత్‌ను అధిక ధరలకు కొంటున్న విషయాన్ని తప్పుగా ప్రచారం చేసిందన్నారు. స్కాం బయటపడుతుందనే భయంతో నాటకం ఆడుతున్నారన్నారు. రూ.2కు కొనాల్సిన యూనిట్ విద్యుత్‌ను రూ.12కు ఎందుకు కొనుగోలు చేయాల్సి వస్తోందని ప్రశ్నించారు. రామగుండం 62మెగావాట్ల సబ్‌క్రిటికల్ పవర్‌ప్రాజెక్టును మూసివేయాలని చూస్తున్నారని, సూపర్‌క్రిటికల్ ప్రాజెక్టుగా మార్చి కొనసాగించాలన్నారు. అన్ని వనరులున్న ఈప్రాంతంలో పవర్‌ప్రాజెక్టులు ఏర్పాటు చేయకుండా, యాదాద్రి, ఇతర ప్రాంతాల్లో పెట్టాలని చూస్తున్నారని, అధికార పార్టీ నాయకుల తీరును రామగుండం ప్రజలు గమనించాలన్నారు. సమావేశంలో మహంకాళి స్వామి, ఎం.రవికుమార్, పెద్దెల్లి ప్రకాశ్, పెండ్యాల మహేష్, తాళ్లపెల్లి యుగేందర్, కొటం సతీష్, మారెల్లి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లాస్థాయి బెస్ట్ షార్ట్ ఫిల్మ్ పోటీలు

గోదావరిఖని: జిల్లాస్థాయి బెస్ట్ షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్ జాబ్‌మేళా ఫౌండేషన్ చైర్మన్ మన్మోహన్, సునంద తెలిపారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నవ సమాజ నిర్మాణం పేరుతో మంచి సందేశాన్ని అందిస్తూ 15 నిమిషాల నిడివి గల వీడియో పంపించాలన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా సమాజ అభివృద్ధి, చైతన్యం కోసం చిత్రీకరించిన షార్ట్ ఫిల్మ్‌లు పంపించాలని పేర్కొన్నారు. బెస్ట్ లఘుచిత్రంగా ఎంపికైన వీడియోకు ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.5 వేలు, మూడో బహుమతిగా రూ.3 వేలు అందించనున్నట్లు తెలిపారు. షార్ట్ ఫిల్మ్‌లు పంపించడానికి ఈ నెల 20 చివరి తేదీ అని, 23న ఫలితాలు ప్రకటిస్తామన్నారు.

'ప్రజావసరాలు తీర్చేవారు ప్రజాప్రతినిధులు'

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ప్రజల అవసరాలు తీర్చేవారు ప్రజాప్రతినిధులని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం ఆర్జీ–2 ఆధ్వర్యంలో 19వ డివిజన్ మహాకవి పోతనకాలనీలో, యైటింక్లయిన్‌కాలనీ 17వ డివిజన్ ఏరియాలో రెండు ఆర్వో వాటర్ ప్లాంట్‌లను జీఎం మనోహర్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి కార్మిక కుటుంబాలతో పాటు ఇక్కడ నివా సం ఉండే ప్రజలకు శుద్ధ జలం అందించేందుకు సింగరేణి సహకారంతో ఒక్కో ప్లాంట్‌కు రూ.16.5 లక్షల చొప్పున రెండు ఏర్పాటు చేసినట్లు తెలిపా రు. జీఎం మనోహర్ మాట్లాడుతూ, సింగరేణి కార్మికులతో పాటు ప్రభావిత గ్రామాల అభివృద్ధికి సంస్థ అనేక వసతులు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్, కార్పొరేటర్లు తాళ్ల అమృత, బాదే అంజలీదేవి, సాతగంటి శంకర్, డీజీఎం సివిల్ ధనుంజయ్, సీనియర్ సెక్యూరిటీ అధికారి రమణ, ఈ ఈ ప్రతాపగిరి రా జ, బీఆర్ఎస్ నాయకులు, సదయ్య, జక్కు లదామోదర్‌రావు, గోపాలరావు, రాంచందర్, కుమార్‌నాయక్, ప్రశాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

చర్చల సమయంలో సమ్మె చేయొద్దు


బిజయ్‌కుమార్ సిగ్దర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నాయని, ఎలాంటి సమ్మె చేయకూడదని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఏజీఎం(హెచ్‌ఆర్)బిజయ్‌కుమార్ సిగ్దర్ ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ ఏజెన్సీల ద్వారా కార్మికులకు కనీస వేతనాలతో పాటు, అదనపు ప్రోత్సాహకాలు, అలవెన్సులు ఇతర ఎన్టీపీసీ సంస్థల్లో కంటే ఇక్కడ ఎక్కువ చెల్లిస్తున్నామని వెల్లడించారు. అదనపు ప్రోత్సాహకాలపై కాంట్రాక్టు వర్కర్స్ యునైటెడ్ ఫోరం నాయకులు చేస్తున్న డిమాండ్ చాలా ఎక్కువగా ఉందన్నారు. డిమాండ్‌ల కొత్త చార్టర్ ప్రస్తుతం చర్చల నేపథ్యంలో ఆర్ఎల్‌సీ కార్యాలయంలో పెండింగ్‌లో ఉందని తెలిపారు. చర్చలకు సంబంధించి ఆగస్టు 10న హైదరాబాద్‌లో తదుపరి సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. ఎన్టీపీసీ అభ్యర్థన మేరకు నాయకులు చర్చలు జరిగే వరకు ఎలాంటి ఆందోళనలు చేయకూడదని ఆర్ఎల్‌సీ సమక్షంలో సంతకం చేశారని తెలిపా రు. విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలిగితే ప్రజల జీవనోపాధిపై ప్రభావం చూపడంతో పాటు దేశానికి నష్టం వాటిల్లుతుందని గమనించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను తప్పుదోవ పట్టించవద్దని యూనియన్ నాయకులను కోరారు.

గాడితప్పిన బల్దియా పాలన

- శుక్రవారంతో ముగిసిన మున్సిపల్ కమిషనర్ సెలవులు
- పొడిగింపా? విధుల్లోకా?
- జీతాలు అందక కార్మికుల ఇబ్బందులు
- అందుబాటులో లేని ప్రజాప్రతినిధులు
- రామగుండంలో పరిస్థితి


రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం అటు కీలకమైన అధికారులు... ఇటు ప్రజాప్రతినిధుల సందడి లేక బోసిపోతోంది. 15 రోజులుగా సెలవుల్లో ఉన్న అధికారులు మరో మున్సిపాలిటీకి బదిలీ చేయించుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తుండటం బల్దియాలో చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు కూడా 15 రోజులుగా సెలవుల్లో ఉండటంతో జీతాలు అందక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారంతో ఆయన సెలవులు ముగిశాయి. శనివారం విధుల్లో చేరుతారా? లేకుంటే సెలవులు పొడిగించుకుంటారా? అనేది తెలియాల్సి ఉంది. అధికారులు, ముఖ్య ప్రజాప్రతినిధుల మధ్య ఏర్పడిన సమన్వయలోపంతో బల్దియా కార్యాలయంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

572 మంది ఉద్యోగులు..

బల్దియా కార్యాలయంలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న 572 మంది ఉద్యోగులకు ఇప్పటివరకు జీతాలు రాలేదు. సుమారు రూ.90 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. వీరితోపాటు 180 మంది ర్యాగ్‌పిక్కర్లకు ప్రోత్సాహక నగదు, మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులకు కూడా గౌరవ వేతనాలు ఇవ్వాల్సి ఉంది. మున్సిపల్ కమిషనర్ ఈ నెల 2వ తేదీ నుంచి ఈ నెల 14 వరకు అనారోగ్య కారణాలు చూపుతూ సెలవులు పెట్టారు. వేతనాలకు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు చేయలేదు. చెక్ పవర్ మరో అధికారికి లేకపోవడంతో ఉద్యోగుల జీతాలు మంజూరు కాలేదు. కమిషనర్ శనివారం విధుల్లో చేరాల్సి ఉంది. అయితే ఆయన కార్మికుల వేతనాల ఫైళ్లపై సంతకాలు చేసి, తిరిగి సెలవులు పెట్టే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది.

బదిలీ ప్రయత్నాల్లో కమిషనర్?

రామగుండం మున్సిపల్ కమిషనర్ మరో మున్సిపాలిటీకి బదిలీ చేయించుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఓ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు ఆ నియోజకవర్గంలోని మంత్రి కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం.

ఖాళీ చాంబర్ల దర్శనం..

ప్రజాప్రతినిధులు అందుబాటులో లేకవడంతో బల్దియాలో పరిపాలన గాడితప్పుతోంది. సమస్యల పరిష్కారం కోసం అధికారులకు మొరపెట్టుకోవడానికి కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఖాళీ చాంబర్లు దర్శనమిస్తున్నాయి. అభివృద్ధి పనులపై ఒకవైపు విజిలెన్స్ విచారణ జరుగుతున్న నేపథ్యంలో సెలవులో ఉన్నామని చెబుతున్న కొందరు ఇంజినీర్లు వివాదాస్పదమైన ఫైళ్లపై నిబంధనలకు విరుద్ధంగా వర్క్ ఫ్రం హోం చేస్తున్నారని సమాచారం.

కనీస వేతన చట్టాలను సవరించాలి


అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పెండింగ్‌లో ఉన్న కనీస వేతన చట్టాలను వెంటనే సవరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా 73 కనీస వేతనాల జీవోలను పెండింగ్‌లో ఉంచిందని ఆరోపించారు. ఈ కారణంగా కోటి మంది కార్మికులు కనీస వేతనం అందుకోలేక పోతున్నారని పేర్కొన్నారు. వారికి దక్కాల్సిన ప్రయోజనాలను పెట్టుబడిదారులకు అందించేందుకు సర్కారు కృషి చేస్తోందని మండిపడ్డారు. నాయకులు కుమారస్వామి, భిక్షపతి, అంజయ్య, రామాచారి, అరవింద్, మాతంగి రాజమల్లు, హరికిషన్, బ్రహ్మచారి, స్వామి, మహేందర్, రవి తదితరులున్నారు.

కుర్సికమి భూసమస్య పరిష్కారానికి సీఎం హామీ


ఎమ్మెల్యే చందర్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

రామగుండం: నిజాం కాలం నాటి అజామాబాద్ ఇండస్ట్రియల్ పేరుతో స్వాతంత్ర్యానికి పూర్వం అంతర్గాం మండలంలోని రాయదండి, పెద్దంపేట శివారులో వేలాది ఎకరాల భూసేకరణ చేసిన విషయం తెలిసిందే. నేటి వరకు ఆ భూముల్లో ఎలాంటి పరిశ్రమలు నెలకొల్పలేదు. దీంతో వాటిపై తమకు పట్టాలు జారీ చేయాలని సంబంధిత రైతులు ఏళ్లుగా ప్రభుత్వాలను కోరుతున్నారు. ఈ నేపథ్యంలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సదరు భూసమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శుక్రవారం పెద్దంపేటలో సర్పంచ్ మేర్గు భాగ్యమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కొలిపాక శరణ్య, బీఆర్ఎస్ ప్రతినిధులు పుట్ట శ్రీనివాస్, కొలిపాక మధుకర్‌రెడ్డి, కరివేద శ్రీనివాస్‌రెడ్డి, ఆముల శ్రీనివాస్, తోట సత్తయ్య, బండి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు శాలువాతో సత్కరించారు.

'ఆర్‌అండ్‌ఆర్'లో ఆలయ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న జీఎం సుధాకర్

మంథని: మండలంలోని రచ్చపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో రామాలయ నిర్మాణ పనులను శుక్రవారం ఆర్జీ–3 జీఎం సుధాకర్ ప్రారంభించారు. రూ.40 లక్షలతో చేపట్టే పనులను ఆరు మాసాల్లో పూర్తి చేయాలన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి, అభివృద్ధి పనులు పరిశీలించారు. కాగా, పాఠశాలకు బెంచీలు, కుర్చీలు సమకూర్చాలని, గ్రామంలో లింక్ రోడ్లు, పైపులైన్, దోబీఘాట్‌తోపాటు ఇతర అభివృద్ధి పనులకు 10 ఎకరాల భూమిని ఇప్పించాలని సర్పంచ్ కనవేన శ్రీనివాస్ జీఎంను కోరారు. గ్రామానికి మినరల్ వాటర్ ప్లాంటు, 15 బోర్లు మంజూరు చేయాలని విన్నవించగా సానుకూలంగా స్పందించారు. ఎంపీటీసీ సభ్యుడు మిర్యాల ప్రసాద్ రావు, పీవో రాజేందర్, టీబీజీకేఎస్ నాయకుడు గౌతం శంకరయ్య, సీఎంవోఏఐ వైస్ ప్రెసిడెంట్, ఎస్ఎస్‌వో లక్ష్మీనారాయణ, ఎస్టేట్ అధికారి ఐలయ్య తదితరులున్నారు.

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి


వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్, నాయకులు

రామగుండం: రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ఇచ్చిన హామీని సత్వరమే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జూపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం అంతర్గాం ఎంపీడీవో యాదగిరికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికులకు శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడం లేదని, జీవో 60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600, మిగతా వారికి పీఆర్సీ నివేదిక ప్రకారం బేసిక్ వేతనం రూ.19 వేలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని కోరారు. మృతుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు, ఇన్సూరెన్స్ రూ.5 లక్షలకు పెంచాలన్నారు. పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల రమేశ్, కోడిపుంజుల లక్ష్మి, తీగుట్ల రాములు, కొట్టె తిరుపతి, స్వరూప, మార్త రాములు, గొల్లపల్లి చంద్రయ్య, కట్ట తేజేశ్వర్ తదితరులున్నారు.

వ్యవసాయ బావిలో పడి వృద్ధుడి మృతి

ఇల్లందకుంట(హుజూరాబాద్): వ్యవసాయ బావిలో పడి ఓ వృద్ధుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన ఒట్టె కనకయ్య(92) భార్య, కుమారుడు గతంలోనే చనిపోయారు. ఐదేళ్లుగా ఆయన మతిస్థిమితం లేక తిరుగుతున్నాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి, భోగంపాడు గ్రామంలో ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడి, మృతి చెందాడు. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీయించి, పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కోడలు ఓదెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.చంద్రశేఖర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


గణేశ్ (ఫైల్)

గోదావరిఖని: స్థానిక చంద్రబాబు కాలనీకి చెందిన కాంతాల గణేశ్(22) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. గణేశ్ తన ఇంటి దగ్గర చికెన్ సెంటర్ నడుపుతున్నాడు. శుక్రవారం దాని వెనకాల ఉన్న మోటార్‌ను ఆన్‌చేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై, అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై సమ్మయ్య తెలిపారు. కాగా గణేశ్ కుటుంబసభ్యులను డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ ఓదార్చారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట కార్పొరేటర్ నగునూరి సుమలత, నాయకులు ఉన్నారు.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్..


అరుణ్ (ఫైల్)

కమాన్‌పూర్: రామగిరి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న బండ అరుణ్(29) చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. రాజన్న సిరిసిల్ల జిల్లా చిన్న బోనాల గ్రామానికి చెందిన అరుణ్ ఏడాదిగా రామగిరి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. రెండేళ్ల క్రితం ఆయనకు వివాహం కాగా కుటుంబ కలహాల వల్ల విడాకులు తీసుకున్నాడు. నెల రోజుల క్రితం రెండో పెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్య జ్ఞాపకాలు మర్చిపోలేని అరుణ్ ఈ నెల 11న సెంటనరీకాలనీలోని తన క్వార్టర్‌లో క్రిమిసంహారక మందు తాగాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి భార్య కోమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి ప్రసాద్ పేర్కొన్నారు.

రెండేళ్లకే నూరేళ్లు

- నీటి సంపులో పడి బాలుడి మృతి


ఆదిత్య (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్ (పెద్దపల్లి): రెండేళ్లకే ఆ బాలుడికి నూరేళ్లు నిండాయి.. నీటి సంపులో పడి మృతిచెందగా.. ఆస్పత్రి వద్ద కుటుంబసభ్యులు రోదించిన తీరు అక్కడున్నవారిని కంటతడి పెట్టించింది. పోలీసుల వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధి శాస్త్రీనగర్‌కు చెందిన రాపోల్ సౌమ్య– వెంకటకృష్ణ దంపతులకు ఇద్దరు కుమారులు శ్రీవాత్సవ్, ఆదిత్య(2) ఉన్నారు. వెంకటకృష్ణ స్థానికంగా ఓ షోరూంలో పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఆదిత్య ఆడుకుంటున్నాడని భావించి, తల్లి సౌమ్య వంట పనిలో నిమగ్నమైంది. పని పూర్తి చేసుకొని, బయటకు వచ్చి చూడగా ఆదిత్య కనిపించలేదు. చుట్టుపక్కల వెతుకుతుండగా నీటిసంపులో మునిగి కనిపించాడు. బయటకు తీసి, వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజేందర్ పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

శంకరపట్నం(మానకొండూర్): ఆముదాలపల్లి–మెట్‌పల్లి గ్రామాల మధ్య శుక్రవారం ఏడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్ తెలిపారు. వీణవంక మండలంలోని మానేరు వాగు నుంచి అనుమతి పత్రాలు లే కుండా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని, కేశవపట్నం ఠాణాకు తరలించినట్లు పేర్కొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఆటోకాడ్ సివిల్ త్రీడీ టెక్నాలజీపై శిక్షణ


మాట్లాడుతున్న జీఎం మనోహర్

గోదావరిఖని: సింగరేణిలోని సర్వేయర్లకు ఆటోకాడ్ సివిల్ త్రీడీ టెక్నాలజీపై శిక్షణను ఆర్జీ–2 ఏరియా సిమ్‌టార్స్‌లో జీఎం ఎ.మనోహర్, కార్పొరేట్ సర్వే జీఎం రవి శుక్రవారం ప్రారంభించారు. 14 రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుందని తెలిపారు. సింగరేణి వంద మిలియన్ టన్నుల లక్ష్యం వైపు దూసుకుపోతున్న నేపథ్యంలో భారీ ఉత్పత్తిని సాధించడానికి ఓపెన్‌కాస్ట్ గనులపై ఆధారపడి పని చేస్తున్నామని పేర్కొన్నారు. ఓసీపీల్లో ఆఫ్‌లోడింగ్ పనుల్లో లోపాలను తగ్గించడానికి త్రీడీ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ ఉపయోగపడుతుందని చెప్పారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి సంస్థ అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిమ్‌టార్స్ డీజీఎం శర్మ, హుస్సేని, పీవీ రమణ, చందన తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, టీబీజీకేఎస్‌కు రాజీనామా


మాట్లాడుతున్న కార్పొరేటర్ శంకర్‌నాయక్

యైటింక్లయిన్‌కాలనీ: బీఆర్ఎస్ సభ్యత్వానికి, టీబీజీకేఎస్ జీఎం, సెంట్రల్ కమిటీలకు రాజీనామా చేస్తున్నట్లు 15వ డివిజన్ కార్పొరేటర్ బదావత్ శంకర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్ భవన్‌లో ఆయన మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి బీఆర్ఎస్, టీబీజీకేఎస్, బీజేపీలు సహకరించకపోవడంతో పార్టీ మారాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. తనతోపాటు బీఆర్ఎస్, టీబీజీకేఎస్, బీజేపీ నుంచి మరికొందరు త్వరలోనే మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలిపారు.

టీబీజీకేఎస్ నుంచి ఇద్దరి తొలగింపు

తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ఆర్జీ–2 ఏరియా జీఎం కమిటీ మెంబర్, సెంట్రల్ కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బదావత్ శంకర్‌నాయక్ తోపాటు ఆర్జీ–2 ఏరియా బ్రాంచి కమిటీ సెక్రటరీ ప్రభాకర్‌లను పదవుల నుంచి, ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగిస్తున్నట్లు టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. ఇద్దరూ యూనియన్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా కార్యక్రమాల్లో పాల్గొంటున్నందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సింగరేణి సివిల్ అధికారులకు సన్మానం


అధికారులను సన్మానించిన కాంట్రాక్టర్లు


జీఎం రవిని సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని: స్థానిక బంగ్లాస్ ఏరియాలోని ఇల్లందు గెస్ట్‌హౌస్‌లో సింగరేణి సివిల్ అధికారులను కాంట్రాక్టర్లు శుక్రవారం సన్మానించారు. ఉద్యోగ విరమణ చేయనున్న డీవైఎస్ఈ వెంకటేశ్వర్‌రావు, జేఈ శంకరయ్య, సూపర్‌వైజర్ జోసెఫ్, క్లర్క్ జగన్నాథంలను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సివిల్ డీజీఎం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ–3 సర్వే కార్యాలయం సందర్శన

కమాన్‌పూర్: ఆర్జీ–3 సర్వే డిపార్ట్‌మెంట్ కార్యాయాన్ని కార్పొరేట్ సర్వే జీఎం పీఎస్‌కే.రవి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సర్వేకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జీఎంను సర్వే డిపాంట్‌మెంట్ ఇన్‌చార్జి జైనులాబద్దీన్, అధికారి వెంకటేశ్వర్లు, స్టాఫ్ శ్రీనివాస్, లక్ష్మణ్, రవీందర్, సమ్మయ్య సన్మానించారు.

అందుబాటులోకి ఆటవిడుపు పరికరాలు


సరదాగా ఆడుకుంటున్న కార్మికులు

కమాన్‌పూర్: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లోని అన్ని కంపెనీల్లో పని చేస్తున్న ఆఫ్‌లోడింగ్ కార్మికుల కోసం ఆటవిడుపు పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. 18వ రక్షణ త్రైపాక్షిక సమావేశానికి వచ్చిన డీవైడీజీఎంఎస్ భూషణ్‌ప్రసాద్ సింగ్ ఆఫ్‌లోడింగ్ కార్మికులకు ఆటవిడుపు పరికరాల సదుపాయం కల్పించాలని ఆదేశించారు. దీంతో ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు సూచన మేరకు ఓసీపీ–2 సీ–5, ఈపీఎల్ కంపెనీలో పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఏర్పాట్లను ఓసీపీ–2 గని మేనేజర్ రామారావు, ఆఫ్‌లోడింగ్ ఇన్‌చార్జి రాజేశ్, గని సంక్షేమ అధికారి బండారి మురళి శుక్రవారం పరిశీలించారు.

ఏరియర్స్, వాటా ఒకేసారి చెల్లించండి


మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని: సింగరేణి కార్మికులకు రావాల్సిన 11వ వేజ్‌బోర్డు ఏరియర్స్, లాభాల వాటా ఒకేసారి చెల్లించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లకోసారి యూనియన్ మహాసభలు జరగాల్సి ఉందని, కోవిడ్, వివిధ కారణాల వల్ల ఆరేళ్లుగా జరగలేదన్నారు. ఈ క్రమంలో ఆగస్టు 25, 26, 27 తేదీల్లో మహాసభలను గోదావరిఖనిలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిల్లో బ్రాంచిలు, ఫిట్ కమిటీ నాయకులను ఒకేసారి ఎన్నుకుంటామని తెలిపారు. సింగరేణిలో పాత పోరాటాలు పునరావృతం కావాలని, హక్కుల సాధన కోసం కార్మికులు ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. బొగ్గు గని కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం చేశామన్నారు. ఈసారి వేజ్‌బోర్డు ఏరియర్స్ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. లాభాల వాటా రూ.లక్షకు పైగా రానుందన్నారు. దీపావళి బోనస్ రూ.లక్ష ఇవ్వాలని కోరుతున్నామని తెలిపారు. నాయకులు ఎల్.ప్రకాశ్, కె.రాజ్‌కుమార్, బాజిసైదా, వైవీ రావు, కె.వీరభద్రం, ముస్కె సమ్మయ్య, మడ్డి ఎల్లాగౌడ్, కె.రాజారత్నం, జూపాక రాంచందర్, కొట్టె కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విలాసాగర్ యువకుడిపై పీడీయాక్టు


పీడీయాక్టు కాపీ అందిస్తున్న సీఐ రవీందర్

కరీంనగర్ క్రైం: వరుస నేరాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఓ యువకుడిపై కరీంనగర్ పోలీసులు పీడీయాక్టు అమలు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన సంపంగి ప్రేమ్‌కుమార్ గతంలో హైదరాబాద్‌లో ప్రైవేట్ డ్రైవర్‌గా పని చేశాడు. ఆ సమయంలో చోరీ చేయగా కేసు నమోదైంది. తర్వాత తిరిగి స్వగ్రామం వచ్చాడు. స్థానికంగా ఓ వ్యక్తిపై భౌతిక దాడి, బెదిరింపులకు పాల్పడిన ఘటనలో పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. 2022లో రామడుగు మండలానికి చెందిన ఓ బాలికను సోషల్ మీడియాలో పరిచయం చేసుకొని, మాయమాటలు చెప్పి, లైంగికదాడికి పాల్పడ్డాడు. జైలుకు వెళ్లి వచ్చినా ప్రవర్తన మార్చుకోలేదు. గంగాధర మండలంలో ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ కేసులో గత మే నెలలో పోలీసులు అరెస్టు చేయగా జైలులో ఉన్నాడు. కమిషనరేట్ పరిధిలో వివిధ నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ప్రేమ్‌కుమార్‌పై పోలీసులు పీడీయాక్టు అమలు చేసి, సంబంధిత కాపీని శుక్రవారం జైలు అధికారుల సమక్షంలో అతనికి అందజేశారు. అనంతరం చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు. పీడీయాక్టు అమలులో కీలక పాత్ర పోషించిన కరీంనగర్ రూరల్ ఏసీపీ టి.కరుణాకర్, చొప్పదండి సీఐ జి.రవీందర్, పీడీ సెల్ ఇన్‌చార్జి పండరీలను సీపీ సుబ్బారాయుడు అభినందించారు.

విద్యార్థి అదృశ్యం

- ఇంటికి చేరినట్లు సమాచారం

చొప్పదండి: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్న ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన అరుణ్ చొప్పదండి సమీకృత బాలుర వసతి గృహంలో చేరేందుకు రెండు రోజుల క్రితం వచ్చాడు. అతని పేరు ఇంకా రిజిష్టర్‌లో నమోదు చేయలేదు. హాస్టల్ నుంచే గురువారం పాఠశాలకు వెళ్లిన అరుణ్ సాయంత్రం తిరిగి రాలేదు. దీంతో హాస్టల్ నిర్వాహకులు విద్యార్థి తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం అందించారు. కాగా విద్యార్థి తప్పిపోయినట్లు సోషల్ మీడియాలో పోస్టులు చక్కర్లు కొట్టాయి. శుక్రవారం రాత్రి వరకు అతను ఇంటికి చేరినట్లు సమాచారం.